# లకుముకి పిట్ట



"బు......ర్......ర్......ర్......" ఒక్కసారిగా శబ్దం చేస్తూ పక్కనొచ్చి వాలింది లకుముకిపిట్ట.

అసలే బాగా అలసిపోయి వుండేమో, అందులోనూ నిరాహారంగా ఉంది గాబోలు, దీనంగా, పరధ్యానంగా ఉన్న పాలపిట్ట ఆ శబ్దానికి ఉలిక్కిపడింది. మర్రికొమ్మమీది నుండి క్రింద పడబోతూ అతి ప్రయత్నం మీద నిలదొక్కుకుంది.

"ఛ!....... నీకసలు బుద్ధుందా?..... నువ్వసలు పక్షివా ? మనిషివా ?" అంత నిస్త్రాణంలోనూ అంతెత్తునెగిరింది పాలపిట్ట.

"అరె, ఏమైంది పాలన్నా ! గట్లకోపం జేస్తవు ?" అంటూ తేరిపార జూచి "ఎప్పట్లాక ఉషారుగున్నవనుకున్న. పానం బాలేదా ?" పాలపిట్ట పరిస్థితి జూసే టప్పటికి లకుముకి పిట్టకు ఉత్సాహం స్థానే జాలి కలిగింది. కాని, తనను మనిషితో పోల్చినందుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'అరరే, పాపం బాధపడ్డట్టున్నాడు. అనవసరంగా తిట్టానే !' నొచ్చుకుంది పాలపిట్ట.

"ఒరే లకుముకీ ! నిన్ను తిట్టాలని లేదురా ! నీ మితిమీరిన ఉత్సాహంతోని నేను పడిపోయేటోన్ని గదా ! అందుకోసరమని....." అనునయించింది.

"పోన్లేన్నా ! నువ్వుగాపోతే నీ పిల్లలు దిడ్తరా ?" పాలపిట్ట సంజాయిషీ లకుముకి పిట్టలో మళ్ళీ కొత్త ఉత్సాహం నింపింది. "అది సరే ! ఏంది? అంత నీర్సంగున్నవ్ ?" మరోసారి అడిగింది.

"ఏం జెయ్యనురా, రెం(డ్రోజులుగా గింజ దొరకలేదు. ఈ ఎండలకూ, గాలులకూ చిన్న చిన్న పురుగులు గూడా మాడి, బూడిదై ఎక్కడ గొట్టుక పోతున్నాయో మరి ? మీ వొదినేమో నిన్న మొన్న కన్ను దెరిసిన సన్న పిల్లల్ని వొదులుకోలేకపోతున్నది. అటు పిల్లల్లూ, ఇటునేనూ ఈ ఎండాకాలం బుగ్గిగాక తప్పేట్టులేదురా !" నిరాశ, నిర్వేదం ప్రతి మాటలో ప్రతిధ్వనించాయి పాలపిట్ట మాటల్లో.

"అన్నా; సుకాల్లో (సుఖాల్లో) నేను గుర్తుకు రాకపోతే వోయె. కష్టకాలంలో నన్నా నన్ను మతికి (జ్ఞాపకం) జేసుకోవొద్దా ? మా జూరాలకొస్తే నీ రోగాలన్నీ మాయమయితై ; సల్లటి నీళ్ళు ; కడుపు బగిలిపొయ్యేటంత శాప (చేప) మాంసం....... దా ! బేగి (త్వరగా) మనం జూరాలవోదం !" ఆత్మీయతను రంగరించిన ఆహ్వాన గీతాన్నాలపించింది లకుముకి పిట్ట.

"అట్ల గూడా ఒగ మాటు అనిపించిందిరా ! 'చెడి, చెల్లెలింటికి వోవద్దన్న'రు గాని, తమ్మునింటికి పోవద్దనలేరు గదా ! నీ దెగ్గరికొద్దామనే అనుకున్నా. కాని, ఎక్కడి మూలమల ? ఎక్కడి జూరాల ? రెండు మైళ్ళైనా అయితది. ఈ రెక్కల్లో అంత బలం లేదురా ! మార్గ మద్దెంలో వడిపోతే కుక్క సావే (చావే). ఇక్కడ జస్తే శవాన్నైనా జూస్తరు." బాధ, నిరాశా వాదాన్ని బలోపేతం చేసింది - పాలపిట్ట గొంతులో.

"అదేందన్నా, గట్ల మాట్లాడ్తవ్ ?" కలవరపడిపోయింది లకుముకి పిట్ట. "కష్టాలు మనకు గాక మానులకొస్తయా ? గిసువంటప్పుడే దైర్నంగ (ధైర్యంగా) ఉండాలె. నీ బలమేపాటిదో నీకు దెల్వదిగాని, నాకు దెల్వదా ? జూరాలేం కర్మ ? వొదినమ్మను జూడనీకె గద్వాల దాంక ఒక్క దమ్ముకు వొయ్యి, మల్ల దమ్మున యెనకకు మల్లిరాలే ? మనిషివోలే గట్ల శాత(చేత) గాని మాటలెప్పుడు నేరుసు కున్నవ్ ?" ఉత్సాహాన్ని రగుల్కొలిపే ప్రయత్నం లకుముకి పిట్టది.

"ఆఁ ..... ! ఆరోజులు వోయినయ్‌రా ! ఇప్పుడంత కువ్వత్ (బలం) లేదు. వొయిసులున్నప్పుడెన్నో జేశినం. గిప్పుడు గట్లే జేస్తాం ? మరొగ పక్క కదలనీయ కుండా చిట్ట - పట్ట - ఈ ఎండలు !................."

"పో, పో, అన్నా! ఏం మాట్లాడ్తున్నవ్, మూడ్రోజుల కింద పులుగుల్ని దిన్నీకె చెడుగు (పాము) వొస్తె, దెబ్బకు దాన్ని తుకుడలు - తుకుడలు జేసినవంట గద ! ఆంజనేయుని వోలె నీ బలం నీకు దెల్వది గాని, పద - పద, నేను వొదినమ్మకు జెప్పేసే వొచ్చిన. ఆలిసం(ఆలస్యం) జేస్తే పొద్దైతది. లేవు ! పోదాం !" తొందర పెట్టింది లకుముకి.

ఆశ్చర్యంగా, ఒకింత అనుమానంగా చూసింది పాలపిట్ట.

"అవునన్నా ! నేనింటికి వొయినంకనే నీ వొద్దకొచ్చిన." నమ్మబలికింది లకుముకి

ఒక్క క్షణం తెగింపు గల్గినా, మరుక్షణం తన పరిస్థితి తనకే జాలిగొలిపింది పాలపిట్టకి. 'తనమీద తనకే జాలి గల్గిన వాణ్ణి ఈ లోకంలో ఏ శక్తీ కాపాడ లే'దన్నాడో మహానుభావుడు. నిజమే మరి !

"ఏందన్నా ! ఇంకా శాత(చేత) గానోని వోలె గట్ల జూస్తవు ? లేవు - లేవు ! ఏడుసుకుంట ఏడేండ్లు బతికేకన్నా, మురుసుకుంట మూడొద్దులు (3 రోజులు) బతుకుమన్నరు. గీ మాత్రం దైర్నం లేకపోతె యెట్ల ? నడువ్ ! నీకు ఆయాసమైతె ఆడాడ (అక్కడక్కడ) గూకునుకుంట (కుర్చుంటూ) వోదమ్ !" చెప్పడం తేలిక. చేయడం కష్టం. ప్రేరేపించడం సామర్థ్యంతో ముడివడిన శ్రమ. ఆ ప్రయత్నాన్నే సమర్థవంతంగా నెరవేరుస్తోంది లకుముకి పిట్ట.

"తిన్నంత దిని, జెరసేపు ఆరాం (రెస్ట్) జేసి, పొద్దుగూకేటల్లకు వొదినమ్మకు గూడ ఇంత దీసుకరావచ్చు. లే-లే ! పోదాం !" మళ్ళీ ప్రేరేపించింది.

లకుముకి పిట్ట ప్రయత్నం ఫలించింది.

పాలపిట్ట గుండె నిండా ఊపిరి పీల్చుకుంది.

ఆకాశానికేసి చూసింది.

ఒక్కసారి రెక్కలు విదిల్చింది.

ఖగేంద్రుడ్ని మనసులో స్మరించింది.

"పద ! పోదాం !" సంధించిన బాణంలా గాలిని చీల్చుకుంటూ 'రివ్వు' మంటూ ఆకాశానికెగిరింది.

రెట్టించిన ఉత్సాహంతో 'రివురివ్వు' మంది లకుముకి పిట్ట.

"ఒరే లకుముకీ ! నీ మాటలతోనో, పౌరుషంతోనో, తెగింపుతోనో, పెళ్ళాం పిల్లల్ని కాపాడుకోవాలనో.......... ఇంత దూరం వొచ్చిన. ఇగ నా వల్ల గాదురా !" రొప్పుతూ మద్ది చెట్టు కొమ్మమీద కూలబడ్డట్టు వాలిపోయింది పాలపిట్ట.

"అన్నా ! ఇంకెంత దూరమన్నా ! అదిగో ! అదే జూరాల ! అగో ! ఆ ఎన భైరెండు కానాలు (గేట్స్ ఆఫ్ బ్యారేజీ) గనిపిస్తలేవూ ? ఆవలి పక్క జూడు, సముద్రమోలె నీళ్ళు. ఇంకొక్కటే ఫర్లాంగు. జెర్ర దమ్ముదీసుకోని మళ్ళెగురు." తన ప్రయత్నం చివరికంటా చేరక పోవడాన్ని అంగీకరించలేదు లకుముకి పిట్ట మనసు.

"వల్ల గాదురా !.........." వగరుస్తూ, మరింతగా ఒదిగి పోతూ, వాలిపోతున్న కళ్ళతో సోలిపోతూ..... పాలపిట్ట.

"అన్నా !" పాలపిట్ట పరిస్థితికి కంగారు పడిపోయింది లకుముకి పిట్ట. అంతలోనే ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది.

"నువ్విక్కడ్నే ఉండు. ఒక్క నిద్ర దియ్యి. నేనిప్పుడే వొస్త." జవాబు కోసం ఎదురు చూడకుండా క్షణాల్లో మాయమైంది.

అడిగే ఓపిక కూడా లేక మెదలకుండా ఉండిపోయింది పాలపిట్ట.

పది నిముషాలు గడిచినట్టుంది. లకుముకి రెక్కల చప్పుడుకి కళ్ళు తెరిచింది పాలపిట్ట.

నోట్లో చేపపిల్లను పట్టుకొచ్చింది లకుముకి. దాని సైగ నందుకొని, పసి పిల్లలా నోరు తెరిచింది పాలపిట్ట. గబుక్కున చేపపిల్లను దాని గొంతులోకి జారవిడిచింది.

ఒక్క గుటకలో గొంతులోకెళ్ళి పోయిందేమో చేపపిల్ల, క్షణంపాటు ఉక్కిరి బిక్కిరైంది పాలపిట్ట.

'ఒరే ! నువ్వు దేవుడివిరా !' కృతజ్ఞత గొంతులో నుండి మాటల్లో గాక, గుండెలో నుండి కన్నీరై ఉబికింది.

"ఒక్క పది నిముషాలు ఆరాం జెయ్యి. మస్తు బలమొస్తది." ఆనందం, తృప్తీ కలగలిసిన గొంతుతో లకుముకి పిట్ట.

❋ ❋ ❋

"దేశంలోని నీళ్ళన్నీ ఇక్కడ్నే ఉన్నాయేందిరా ?" కనుచూపు మేరంతా లేత నీలం రంగులో పరచుకున్న స్వచ్ఛమైన కృష్ణా జలాలని ఆశ్చర్యంగా చూస్తూ - పాలపిట్ట.

"వోనకాలం (వర్షాకాలం) జూళ్ళేదింకనీవు. ఎక్కడ జూసినా నీళ్ళేగనిపిస్తయి. గేట్లన్ని దెరిసేస్తరు. నీళ్ళు దుమ్ముమోలె లేసి, ఆకాశంతోని సయ్యాటలాడుతుం టయి. ఇగ శేపలైతె (చేపలైతె) లెక్కేలేదు. 'అందుకో - అందుకో'మంటాని మీని మీని (పైపై) కెగురుతుంటయి....." ఉత్సాహంగా చెప్పుకుపోతుంది లకుముకి.

"ఒరే లకుముకీ ! పిల్లలు కొంచెం గట్టిగ గాంగానే అందరం ఈడికే వొచ్చేస్తంరా ...... అది సరే గాని అంతెత్తున లేస్తున్న తెప్పలు (అలలు), ఈ హోరు గాలి మద్దెన శేపలెట్లారా పట్టుకోటం ?" సందేహంగా అడిగింది పాలపిట్ట.

"ఈడ గాదన్నా మనం శేపలువట్టేది. అవతలి పక్క" తుర్...ర్‌మని బ్యారేజీ గేటు కిందనుండి దూరి కిందనున్న బారికేడ్ పైకి చేరింది.

అనుసరించింది పాలపిట్ట.

బారికేడ్‌కు కింద ఇరవై గజాల దూరంలో నీళ్ళున్నాయి. గేట్లన్నీ మూసేయబడి ఉండటంతో గేట్ల పక్క సందుల్లోంచి 'జల'లాగా వస్తున్న నీళ్ళు లోతైన ఆ ప్రదేశమంతా నిండి పోయి, కృష్ణవేణి జీవప్రవంతిలో లీనమైపోతున్నాయి.

"అదో! ఈ నీళ్ళవైపు బాగా మనసువెట్టి సూడు ! అప్పుడప్పుడు శేపలు గబుక్కున నీళ్ళమీన కొచ్చి, లోనకి వోతుంటయ్ ! బాగా జూస్తే లోపల నుంచి మీదికి ఎంత యేగంగా, ఎంత సేపట్లో వచ్చేస్తయో తెలుస్తది. గది కనిపెట్టి, సరిగ్గ అవి మీదకొచ్చే సమయానికి మనమెళ్ళి లటక్కున పట్టుకోవాలి. గంతే !" క్లాసులో టీచర్ పాఠంలా ఎక్స్‌ప్లెయిన్ చేసింది లకుముకి.

ఆశ్చర్యంగా, ఉత్సాహంగా చూస్తున్న పాలపిట్టకు ఓ ప్రాక్టికల్ కూడా చేసి చూపెట్టింది.

ఆనందంతో గంతులేస్తున్న మనసును అదుపులో పెట్టుకోలేక నీళ్ళలో కురికింది పాలపిట్ట. చేపదొరకలేదు ; కళ్ళలోకి, ముక్కులోకి సర్రున నీళ్ళు దూసుకుపోవడంతో ఉక్కిరి బిక్కిరై, ఒడ్డుకు చేరి వగర్చసాగింది.

కాని, సుశిక్షితుని చేతిలో ఆరితేరిన సైనికునిలా అనతికాలంలోనే చేపల్ని పట్టే ఒడుపు పట్టేసింది. అంతే; పాలపిట్టను పట్టతరం గాలేదు లకుముకికి.

చీకటిలో నుండి వచ్చిన వాడు విపరీతమైన కాంతిని తట్టుకోలేనట్టు - రెండ్రోజులుగా ఆకలితో కొట్టుమిట్టాడిన పాలపిట్ట ఆహారం దొరికిన కొద్దీ రెచ్చిపోయి మరీ నీళ్ళలో మునిగి తేలిందేమో..........అరగంట గడవకుండానే హఠాత్తుగా ఒడ్డున పడిపోయింది రెక్కలు తెగినట్టు.

గాభరాగా చేరుకుందక్కడికి లకుముకి పిట్ట.

"ఏమైందన్నా ?"

పాలపిట్ట మాట్లాడలేదు ; కళ్ళైనా తెరవలేదు.

జీర్ణశక్తి అడుగంటి పోతున్న పేగుల్లో ఆహారమెక్కువైందో ?

ఎండలో కుతకుతలాడిన శరీరం ఆ చల్లని నీటిలో మునకలేయటం వికటించిందో ?

అలవాటు లేని పని అధికంగా చేయటం చేటయ్యిందో ?

దుఃఖంలో మునిగి తేలిన మనస్సు ఒక్కసారి సంతోష తరంగితమైతే ఆ ఉద్వేగాన్ని తట్టుకోటం సన్నని రక్తనాళాలకు శక్తికి మించిన పనైందో ?

పాలపిట్ట మాత్రం పడిపోయింది.

"అన్నా ! ....... అన్నా ......!" జీరవోయిన గొంతుతో విలవిల్లాడింది లకుముకి.

తన ముక్కుతో పాలపిట్ట నోరు తెరిచి, అటూ-ఇటూ కదిలించింది; కనురెప్పల్ని సున్నితంగా ఎత్తే ప్రయత్నం చేసింది ; రెక్కలు నీళ్ళలో ముంచి దాని మీద చిలకరించింది.............

మెల్లగా కళ్ళు తెరిచింది పాలపిట్ట.

"నువ్వు దేవుడివిరా" అంది.

లకుముకి ఆనందంతో మురిసిపోయింది.

**(02-06-2004 నవ్య సచిత్ర వారపత్రిక)**